క్లుప్తంగా

కాసు మహేష్‌రెడ్డి నాయకత్వంలోనే పని చేస్తా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ అశోక్‌కుమార్



పిడుగురాళ్ల: మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నాయకత్వంలోనే పని చేస్తానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పల్నాడు ఓయాసిస్‌లో జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నాకు ఏ పదవి ఇచ్చినా, ఏ హోదా ఇచ్చిన కచ్చితంగా పనిచేస్తానని పేర్కొన్నారు. అదే విధంగా చింతలపూడి చారిట్రబుల్ ట్రస్ట్ తరుపున జర్నలిస్టుల కుటుంబాలకు పల్నాడు హాస్పటల్ ద్వారా వైద్యసేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు.

బైబిల్ క్విజ్ పోటీలను జయప్రదం చేయండి

మాచర్ల: పల్నాడు జిల్లా బైబిల్ డిజిటల్ కాలేజి ఆధ్వర్యంలో మాచర్ల నియోజక వర్గంలో బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పాస్టర్లు శ్రీకాంత్, శంకర్ ఆదివారం తెలిపారు. రెంటచింతల మండలంలో ఆగస్టు 9న హౌస్ ప్రేయర్ చర్చిలో, ఆగస్టు 16న కారంపూడి సెయింట్ లూథరన్ చర్చిలో బైబిలు పోటీలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారికి మొదటి బహుమతిగా రూ.3 వేలు, 2వ బహుమతిగా రూ.2 వేలు, మూడో బహుమతిగా రూ.వెయ్యి ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 6362218163, 6309118960లను సంప్రదించాలని కోరారు.

బావిలో పడి యువకుడు మృతి


మాచవరం: బావిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మహంకాళి దుర్గాప్రవీణ్(20) రెండు రోజుల నుంచి కనిపించకుండా పోయాడు. ఆచూకి కోసం కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికిన ప్రయోజనం లేదు. ఆదివారం ఉదయం గ్రామస్తులు బావి వద్దకు వెళ్లి చూడగా బావిలో శవమై కనిపించాడు. మతిస్థిమితం సరిగా లేనందున కాలుజారి బావిలో పడి ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

పిడుగురాళ్లరూరల్: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ శివారులోని కళ్లంటౌన్‌షిప్ వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. తెనాలికి చెందిన చిక్కా గోపి(55) గత 15 సంవత్సరాల నుంచి కారెంపూడిలో నివాసం ఉంటున్నాడు. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారం నిమిత్తం కారంపూడి, పిడుగురాళ్ల వస్తూ ఉండటం కుదరడం లేదని పట్టణంలోని కళ్లం టౌన్‌షిప్‌లో ఓ ప్లాట్ తీసుకొని అద్దెకు ఉంటున్నాడు. అయితే ఆదివారం మధ్యాహ్న సమయంలో కళ్లం టౌన్ షిప్ నుంచి అద్దంకి నార్కెట్‌పల్లి హైవే ఎక్కుతుండగా గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఒక కారు చిక్కా గోపిని తప్పించబోయి డివైండర్‌ను ఢీకొని అటువైపు రహదారిలోకి వెళ్లింది. కానీ వెనుక నుంచి వస్తున్న ఇనోవా గోపిని ఢీకొనటంతో చిక్కా గోపి(55) అక్కడిక్కడే మృతి చెందాడు. పిడుగురాళ్ల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి నేతల మాయ మాటలు నమ్మవద్దు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్



నరసరావుపేట: నది దాటే వరకు ఓడ మల్లన్న, దాటాక బోడి మల్లన్న సామెత మాదిరి కూటమి పాలన ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్ విమర్శించారు. వామపక్షాలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల ఐదవ తేదీన మంగళవారం అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లు, సచివాలయాల వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరిపై మండిపడ్డారు. గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే ప్రతిపాదన విరమించుకోవాలని వామపక్షాలు, ప్రజా సంఘాలు, ప్రజలు పోరాటాలు చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండని ప్రతిపక్షంలో ఉండగా నేటి మంత్రి నారా లోకేష్ ప్రజలకు పిలుపునిచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి రెడ్ బాషా, సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్‌పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు బోనాలు



రెంటాలలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



యాదవ బజారులో చౌడమ్మకు పూజలు



రెంటాల గ్రామంలో పోలేరమ్మ అమ్మ వారికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

మాచర్ల: పట్టణంలోని పలు అమ్మవారి దేవాలయాల్లో ఆయా దేవతలకు శ్రావణ మాసం ఆదివారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ బజారులో చౌడమ్మ దేవాలయంలో పూజా కార్యక్రమాలు అమ్మవారికి జరిపారు. తొలుత యాదవ బజారులో అమ్మవారికి బోనాలతో ఊరేగింపు నిర్వహించారు.

పోలేరమ్మ గుడిలో..

పట్టణంలోని 17వ వార్డులో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. అమ్మవారికి జేజేలు పలుకుతూ ఊరేగించారు.

చెన్నకేశవ స్వామి వెనుక భాగంలో ఉన్న 25వ వార్డులోని పోలేరమ్మ వారికి బోనాలతో పూజా కార్యక్రమాలు జరిపి, ప్రత్యేకంగా అలంకరించి మహిళలు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.



మాచర్లలో బోనాలు ఊరేగింపు

రెంటాల(రెంటచింతల): వరుణదేవా... కరుణించవా అంటూ ఆదివారం గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా ప్రతి రోజు ఆకాశం మేఘావృతమై ఉంటూ పంటలను సాగు చేసుకునేందుకు సరిపడ వర్షం పడకపోవడంతో గ్రామ పెద్దలు పోలేరమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించాలని తీర్మానించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఆలయ ప్రధాన అర్చకులు నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు బోనాలతో గ్రామపురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. పోలేరమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు.

దొడ్లేరులో తల్లిపాల వారోత్సవాలు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో దొడ్లేరు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి ఆధ్వర్యంలో ఆదివారం అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నకుమారి బిడ్డలకు తల్లిపాల ఆవశ్యకతను తల్లులకు వివరించారు. పుట్టిన గంటలోపు నుంచి ఆరు మాసాల వరకు తల్లిపాలు మాత్రమే బిడ్డకు ఇవ్వాలని, దీంతో బిడ్డల్లో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు



జె.దానమ్మ, ఎం.సునీత, భూలక్ష్మీ, దుర్గాభవాని, పి.వెంకట్రావమ్మ, షాజిరా, మాణిక్యం, షేక్ రహానా, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, బాలింతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



క్షతగాత్రుడు ఆరోగ్యరాజు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల గ్రామ శివార్లో నున్న నేంద్రవాగు సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రెంటచింతల నాయుడుపేట ఎస్సీ కాలనీకి చెందిన రాజు, ఆరోగ్యరాజు ఇద్దరు ద్విచక్ర వాహనంపై గురజాల నుంచి రెంటచింతలకు వస్తుండగా రెంటచింతల వైపు నుంచి వస్తున్న ఓ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు(20) అక్కడిక్కడే మృతి చెందగా ఆరోగ్యరాజుకు ఓ కాలు విరిగి తీవ్రంగా గాయపడగా వెంటనే క్షతగాత్రుడిని నరసరావుపేట జీబీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్యాంపస్ ప్రొటెక్షన్ యాక్ట్ జీఓ విడుదలపై హర్షం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చిరకాలంగా ఎదురుచూస్తున్న సమస్యలపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ క్యాంపస్ ప్రొటెక్షన్ యాక్ట్ జీఓ విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్(అపుస్మా(రాష్ట్ర అధ్యక్షుడు కొలసాని తులసి విష్ణు ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంపాలెంలోని ప్రజ్ఞ స్కూల్‌లో ప్రభుత్వ జీఓ కాపీలు ప్రదర్శించారు. విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ గతంలో విద్యార్థిని, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పాఠశాల యాజమాన్యాలకు అకారణంగా బయట వ్యక్తుల నుంచి, కొంతమంది తల్లిదండ్రుల నుండి అనేక ఒత్తిళ్లు దౌర్జన్యాలు ఎదుర్కోవటం పరిపాటిగా ఉందని చెప్పారు. కొత్తగా వచ్చిన జీఓ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల ప్రాంగణాలలో ఎటువంటి రాజకీయ గుర్తులు, రాజకీయ పార్టీలకు సంబంధించిన వస్తువులు, జెండాలు, కరపత్రాలు ప్రదర్శన నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. సమావేశంలో అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.మస్తాన్ రావు, అదనపు కోశాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం



చిలకలూరిపేట: నియోజకవర్గ పరిధిలోని కొమరవల్లిపాడు, గణపవరం వ్యవసాయ సహకార పరపతి సంఘాల నూతన అధ్యక్షుల ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. కొమరవల్లిపాడు వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా చిలకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన కోడె హనుమంతరావు, డైరెక్టర్లుగా గొట్టిపాటి బాబు(గొట్టిపాడు), మునీర్ హసన్(పురుషోత్తమపట్నం) బాధ్యతలు స్వీకరించారు. గణపవరం వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన పెంటేల శేషయ్య, డైరెక్టర్లుగా పూర్ణే హనుమంతరావు(ఇర్లపాడు), యామిని ధర్మారావు(అప్పాపురం) ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ సీఈవో చింతల అజయ్‌కుమార్, కొమరవల్లిపాడు సొసైటీ అధికారులు బి. అశోక్‌కుమార్, పి. లక్ష్మయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ టూ టౌన్ అధ్యక్షుడిగా ఫణిభూషణ్



నరసరావుపేట: పట్టణానికి చెందిన అడపా ఫణిభూషణ్ టూ టౌన్ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు శశికుమార్ ఆదివారం పార్టీ కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు వల్లెపు కృపారావు, పార్లమెంట్ కన్వీనర్ చిరుమామిళ్ల ఆదినారాయణ, పార్టీ సీనియర్ నాయకులు గుడిపల్లి కృష్ణమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు కామినేని హనుమంతరావు, రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు మైలవరపు సుబ్బారావు, యువమోర్చా జిల్లా అధ్యక్షులు రాజనాల వెంకట రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

గూడ్స్ రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

వినుకొండ: గూడ్స్ రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వినుకొండ రైల్వే స్టేషను సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది. మృతుడిని పట్టణంలోని శృంగారపువనానికి చెందిన నేలవరపు సతీష్ (30)గా రైల్వే పోలీసులు గుర్తించారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

●పాత భవనం... దినదిన గండం



ప్రమాదంగా ఉన్న పెదకూరపాడు ఎంఈవో కార్యాలయం



పెచ్చులూడుతూ కూలేందుకు సిద్ధంగా ఉన్న కచేరి సెంటర్



శిథిలమైన పోలీసు క్వార్టర్లు

ఒకప్పుడు నిత్యం ప్రజలతో కళకళలాడిన ప్రభుత్వ భవనాలు నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. ఏళ్ల తరబడి ఇలా నిరుపయోగంగా ఉన్న పాత భవనాలను కూల్చేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. పెదకూరపాడు ప్రధాన సెంటర్‌లోని కచేరి సెంటర్ గత దశాబ్ద కాలంగా శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉంది. నిత్యం జన సంచారం ఉండే ఈ కచేరి సెంటర్‌లో వ్యాపారాలు, పలు గ్రామాలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు నిలిచి ఉంటారు. ఈ భవనం పెచ్చులూడుతూ ప్రమాదం ఉంది. తహసీల్దార్ కార్యాలయంకు వెళ్లే రహదారిలో గ్రామ రెవెన్యూ కార్యాలయం కూడా ఇదే పరిస్థితిలో ఉంది. పెదకూరపాడు పోలీసు క్వార్టర్లు కూడా గత రెండు దశాబ్దాల కాలంగా నిరుపయోగంగా ఉన్నాయి. మండల విద్యావనరుల భవనం గోడలు పగుళ్లు ఇచ్చి, పెచ్చులూడుతూ ఎప్పుడు కూలిపోతుందోనని ప్రమాదకరంగా ఉండడంతో అక్కడ దాదాపు ఏడాదిగా విధులు నిర్వహించడం లేదు. ఇక్కడ ఉన్న జేబీ పాఠశాల విద్యార్థులు, భవిత కేంద్రం చిన్నారులు భయం గుప్పెట్లో బిక్కు బిక్కుమంటున్నారు. కాలచక్ర రహదారిలోని ఎస్సీ బాలికల వసతి గృహం ప్రమాదకరంగా ఉంది. ఈ పాత భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఎలాంటి విధులు నిర్వహించడం లేదు. కానీ దినదిన గండంగా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అధికారులు నిరుపయోగంగా ఉండి ప్రమాదకరంగా ఉన్న పాత భవనాలను కూల్చివేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

- పెదకూరపాడు

సందడిగా కళాశాల గోల్డెన్ జూబ్లీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: కొత్త రఘురామయ్య జూనియర్ కళాశాల (1975– 2025) స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం కళాశాలలో గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కళాశాలలో వివిధ హోదాలలో పనిచేసిన, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ అనుభవాలను పంచుకున్నారు. తొలి తరం అధ్యాపకులు గరికపాటి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, ఆజాద్, రామయ్య, అబ్బూరి లక్ష్మీనారాయణ తదితరులు అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాస ప్రసాదు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మేజర్ జి.వెంకటేశ్వరరావు, పిజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కౌశిక్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన రణ అంకమ్మ తల్లి కొలుపులు



నరసరావుపేట రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో రణ అంకమ్మ తల్లి కొలుపులు ఘనంగా ముగిశాయి. గుమ్మడిదల ఇలవేల్పుగా పూజలందుకున్న రణ అంకమ్మ తల్లి కొలుపులను గత 30వ తేదీ నుంచి ఆలయంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం కొలుపుల ముగింపులో వైఎస్సార్ సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దొండేటి అప్పిరెడ్డి, నల్లగంగుల యజ్ఞారెడ్డి, గ్రామస్తులు గుమ్మడిదల శివ, బీరం భాస్కరరెడ్డి, కొల్ల వెంకటనారాయణ, కుందా యాకోబు, చంటి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వినియోగదారులు అడ్డుకోవాలి



స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీపీఎం నాయకులు

పిడుగురాళ్ల: స్మార్ట్ మీటర్ల వినియోగాన్ని ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని సుందరయ్య కాలనీలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ నాయకుడు తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... సర్ చార్జీలు, చార్జీలు, సర్దుబాటు చార్జీలు, కస్టమ్స్ చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపుతుంటే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అదానీ కంపెనీకి స్మార్ట్ మీటర్ల బిగించే విధానాన్ని అప్పగజెప్పటం అంటే దేశ సంపదను పెద్ద పెద్ద కార్పొరేటర్లకు దోసి పెట్టే విధానంలో భాగమేనని ఆయన విమర్శించారు. ప్రజలు ఉదయం, సాయంత్రం ఇంటి దగ్గర ఉన్న సమయంలో ఎక్కువ కరెంటు వాడుకున్న సమయంలో కరెంటు బిల్లు ఎక్కువ వసూలు చేసే విధానాన్ని స్మార్ట్ మీటర్ వసూలు చేయడానికి వ్యతిరేకించాలని, ఆన్‌లైన్ రీచార్జి పేరుతో లింకు పెట్టడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. ప్రజలందరూ వ్యతిరేకించాలని, ఆగస్టు 5వ తేదీ గాంధీనగర్ సచివాలయం వద్ద జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, కాలనీ వాసులు ఆదిలక్ష్మి, వెంకన్న, షేక్ సిలార్, సైదాబీ, సంపూర్ణ, సారథి నరసింహారావు, మహేశ్వరి, సంధ్య వెంకటలక్ష్మి, షేక్ సైదా మీరాబి, మస్తాన్, బి.ఆదిలక్ష్మి, సంధ్య, అశ్విని, వెంకట సుబ్బమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

ప్యాసింజర్‌లో అదనపు బోగీలు ఏర్పాటు చేయాలి



ఎంపీ లావు కృష్ణదేవరాయలుకు వినతిపత్రాన్ని అందచేస్తున్న దృశ్యం

రెంటచింతల: మాచర్ల నుంచి గుంటూరు నడుస్తున్న ప్యాసింజర్ రైలుకు తక్కువ బోగీలు ఏర్పాటు చేయడం వలన రెండో స్టేజీ రెంటచింతలలోనే కూర్చునడానికి సీట్లులేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని రెంటచింతల గ్రామ సామాజిక అభివృద్ధి కమిటీ చైర్మన్ పల్లెర్ల కేశవరెడ్డి, ఎంపీ లావు కృష్ణదేవరాయలుకు ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీతో స్థానిక రైల్వేస్టేషన్ దుస్థితిని వివరించారు. రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులులేక ప్రయాణికులు అల్లాడుతున్నారని రైల్వేస్టేషన్‌కు ఆదాయం పుష్కలంగా వస్తున్నా అధికారులు ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రతి రోజు వందలాదిమంది ప్రయాణికులు ఈ రైల్వేస్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్తున్నారని తెలిపారు. గతంలో మాచర్ల నుంచి నాగార్జునసాగర్ వరకు ఉన్న రైలు సౌకర్యం తిరిగి కొనసాగించి మిర్యాలగూడ, నల్గొండ రైల్వేస్టేషన్లు కలుపుతూ హైదరాబాద్‌కు రైలు సౌకర్యం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ రైలు ఏర్పాటు వలన రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఆయన వెంట కన్నెగంటి పౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్ ఉన్నారు.

అలరించిన నృత్యప్రదర్శనలు

నగరంపాలెం: స్థానిక జేకేసీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం పొట్లూరి ఛార్మి(అమెరికా, న్యూజెర్సీ) భరత నాట్యం ఆరంగేట్రం చేశారు. ఆధ్యాత్మ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ శిక్షకురాలు కావ్య శేఖరన్ నేతృత్వంలో నృత్యాలు ప్రదర్శించారు. కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక జీవనంలో భరతనాట్యం దేశ, విదేశాల్లో కీర్తిగడించిందని అన్నారు. ఎన్నారై పొట్లూరి ఛార్మి నృత్యప్రదర్శనలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం ఛార్మికి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఛార్మి కుటుంబ సభ్యులు చైతన్య, జయప్రకాష్, ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్, నిర్వాహకురాలు సిహెచ్.సుశీల పాల్గొన్నారు.

విశ్వ గురువు అవార్డు స్వీకరించడం అభినందనీయం



ప్రసన్నతబాబుకు సన్మానం

నగరంపాలెం: ప్రొటేస్టెంట్ బైబిల్ 1500, క్యాథలిక్ బైబిల్ 1900 పేజీల గ్రంథాలను చేతి రాతతో రాసి గ్రంథస్తం చేసిన జీడీవీ ప్రసన్నతబాబు అభినందనీయమని ఆంధ్ర ఇవాంజిలకల్ లూథరన్ రివైవల్ ఫోరం నాయకులు ఏజీఎం గణేష్‌పాల్ అన్నారు. కోవిడ్-19 వేళల్లో రెండేళ్లకు పైగా శ్రమించి రెండు బైబిళ్లను చేతి రాతతో రాసిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో విశ్వ గురువుగా అవార్డు అందుకున్న సందర్భంగా ఆదివారం ప్రసన్నతబాబు, కమల దంపతులను కన్నావారితోట ఉల్ఫ్ స్టూడెంట్ చాపల్ ప్రార్థన మందిరంలో సత్కరించారు. క్రీస్తు సేవలో ప్రసన్నతబాబు ఉన్నారని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో రివైవల్ ఫోరం అధ్యక్షులు డాక్టర్ ఎంజేవీ గురునాథం, చీఫ్ సలహాదారు డాక్టర్ టీజే రాజేంద్ర ప్రసాద్, చర్చి గురువులు వడ్లమూడి ఆదాం, క్రిస్టఫర్, సంఘ పెద్దలు కూరాకుల డేవిడ్ నిరీక్షణరావు, రాజ శిఖామణి, కుమార్, దయారత్నరాజు, డాక్టర్ వైవీఎస్ రవి, జాన్‌శ్యామేల్, కన్నయ్య, రఘు కుమార్ పాల్గొన్నారు.


గుర్రం జాషువా లా చాంబర్స్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభిస్తున్న మాణిక్యవరప్రసాద్

వినుకొండ: పట్టణంలోని రైల్వేస్టేషను రోడ్డులో ఆదివారం గుర్రం జాషువా లా చాంబర్స్ నూతన కార్యాలయాన్ని మాజీ మంత్రి, న్యాయవాది డొక్కా మాణిక్యవరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాషువా పేరుతో నూతనంగా కార్యాలయం ప్రారంభించేందుకు కృషి చేసిన న్యాయవాదులు అప్పరాజు అపర్ణాదేవి, పరిశపోగు రాహుల్ అంబేడ్కర్, కాకాని నాగేశ్వరరావు, జాషువాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వినుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మీసాల శ్రీనివాసరావు, పొట్లూరి సైదారావు, సీహెచ్‌ఎల్ఎస్ మూర్తి, కావూరి గోపీనాథ్, చాగంటి వీరాంజనేయ చౌదరి, దుగ్గపోగు విజయ్, ధూపాటి విజయ్, ముప్పాళ్ల జ్ఞానేశ్వరరావు, విశ్రాంత డీఐజీ స్టాంప్స్ బాలస్వామి, జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ గుండాల స్వెనోం, సంద్రపాటి సైదా, మారుతీ వరప్రసాద్, న్యాయవాది రెడ్డి నాగ పద్మ పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయలో సందడిగా క్యాంప్ ఫైర్



క్యాంప్ ఫైర్‌లో పాల్గొన్న స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులు

నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయలో ఈనెల ఒకటో తేదీ నుంచి 4వ తేదీ వరకు తెలంగాణ భారత స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్రితీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ –2025 ఆదివారం మూడో రోజుకు చేరింది. ప్రిన్సిపాల్ నీరజ్ శ్రీ వాస్తవ కార్యక్రమ నిర్వహణ పర్యవేక్షించారు. బుద్ధి కల్పనతో కార్యక్రమం ప్రారంభమైంది. యోగా, వ్యాయామంతో స్కౌట్స్, గైడ్స్ శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకున్నారు. ఆదివారం యూనిఫాం పరిశీలన, జాతీయ పతాక ఆవిష్కరణతో క్రమశిక్షణ, దేశభక్తి భావాలను ప్రతిబింబించారు. సోపాన్ నైపుణ్య ప్రాత్యక్ష పరీక్షలు నిర్వహించారు. అనంతరం 'దేశ భక్తి -జాతీయ చిహ్నాలు' అంశంపై ప్రత్యేక సెషన్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. సామాజిక సేవ కార్యక్రమం 'శ్రమదానం'లో విద్యార్థులు చురుకుగా పాల్గొని, సమాజ సేవపై నిబద్ధతను చాటారు. రాత్రి గ్రాండ్ క్యాంప్ ఫైర్ ఆకట్టుకుంది. ప్రత్యేక అతిథిగా పల్నాడు జిల్లా అదనపు ఎస్పీజేవీ సంతోష్ హాజరై, స్కౌట్స్‌కు ప్రోత్సాహకర సందేశం అందించారు. కార్యక్రమంలో ఎస్. విజయకుమార్, రవీందర్, రామ్‌కోటి, మృత్యు సమద్దర్ తదితర అధికారులు పాల్గొన్నారు.